ప్రజాశక్తి
ఆదివారం 11 డిసెంబర్ 2022
5
పార్వతీపురం మన్యం

పోలమాంబ ఆలయ ఇఒగా రాధాకృష్ణ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర పోలమాంబ అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా వాకర్ల రాధాకృష్ణను నియమిస్తూ దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పాలకొండ ఆలయాల కార్యనిర్వహణాధికారిగా ఈయన పనిచేస్తున్నారు. ప్రస్తుత పోలమాంబ అమ్మవారి జాతర పూర్తయ్యే వరకూ రాధాకృష్ణ ఇఒగా కొనసాగుతారు.

వసతిగృహాల్లో సంక్షేమమేది?

పేద విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కొనసాగుతున్న సంక్షేమ వసతి గృహాలు నేడు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. చాలీచాలని వసతితో ఇరుకు గదులు, సరపడా మరుగుదొడ్లు , బాత్‌రూములు లేకపోవడం, వర్షం వస్తే కారిపోయే భవనాలు నగరంలో దర్శనమిస్తున్నాయి. అసలే చలికాలం కావడంతో కప్పకునేందుకు దుప్పట్లు సైతం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

కనీస సౌకర్యాల్లేని ఎస్‌సి వసతిగృహం

- అరకొర వసతులతోనే నెట్టుకొస్తున్న వైనం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- శాశ్వత భవనాలకు నోచని బిసి వసతి గృహం

బిసి వసతిగృహంలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

ప్రజాశక్తి-విజయగనరంటౌన్

జిల్లా కేంద్రంలో ఒకప్పుడు నాలుగు సాంఘిక సంక్షేమ వసతిగృహాలు ఉండగా, నేడు కేవలం ఒకే ఒక్క హాస్టల్ ఉంది. ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన వసతి గృహం నేడు కేవలం 50 మందితో మాత్రమే నడుస్తోంది. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదివిన విద్యార్థులు ఉన్నత మైన ఉద్యోగాల్లో స్థిరపడిన వారున్నారు. అటువంటి వసతిగృహాలు నేడు ధీనావస్థలో ఉన్నాయి. కాటవీధిలో గల సాంఘిక సంక్షేమ వసతి గృహం స్లాబు పెచ్చులు ఊడిపోయి ఎప్పుడు ఎవరి మీద పడిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. హాస్టల్‌లో 50 మంది విద్యార్థులుంటే బాత్ రూములు, మరుగుదొడ్లు ఆరేసి చొప్పున ఉన్నాయి. వాటిలో రెండు బాత్ రూములు, మరుగుదొడ్ల పని చేయడం లేదు. ఉన్న వాటితోనే విద్యార్థులు గంటల కొద్ది వేచి ఉండి పాఠశాలకు సిద్ధమవ్వాల్సిన పరిస్థితి. మరోవైపు జిల్లా కేంద్రంలోనే బిసి బాలుర, బాలికల వసతి గృహాలు నడుస్తున్నాయి.

పాత రాజ్యలక్ష్మి సినిమా హాలు ఎదురుగా ఉన్న వసతి గృహం అద్దె భవనంలో నడుస్తుంది. కాట వీధిలో వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో అద్దె భవనంలో నెలకు రూ.30వేలు అద్దె ప్రాతిపదికన నడుస్తున్నది. ఇందులో 59 మంది పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి రెండేసి మరుగుదొడ్లు, ఒక్కో బాత్‌రూము ఉన్నాయి. మరోవైపు రూములు చిన్నవి కావడంతో విద్యార్థులు ఇరుకుగా నిద్రపోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు కమాటినే కుక్‌గా మారి పిల్లలకు భోజనాలు వండి పెడుతున్నారు. కమాటి, అటెండర్‌తో వసతి గృహం నిర్వహణ, వంటలు శుభ్రం చేయడం వంటి పనులు చేయిస్తున్నారు. కుక్ లేకపోవడంతో కమాటి ఆపని చేసి పిల్లలకు భోజనాలు వండి పెడుతున్నారు.

> కాటవీదిలో గల పాత బిసి వసతి గృహం చివరకు అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారింది. మందు బాబులు, గంజాయి తాగే వారు ఆ భవనంలోకి వెళ్లడంతో ఆ పక్కనే ఉన్న ఎస్‌సి వసతి గృహ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోకపోతే ఎప్పుడు ఏమి జరుగుతుందోననే ఆందోళన చెందుతున్నారు.

విటి అగ్రహారం బిసి కాలనీలోగల బాలికల వసతి గృహంలో 60 మంది వరకు విద్యార్థులున్నారు. ఆ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. వసతి గృహాలను అభివృద్ధి చేయకపోవడంతో రోజురోజుకూ సమస్యల సుడిగండంలో నడుస్తున్నాయి. గిరిజన బాలికలు వసతి గృహం కూడా పాతభవనం కావడంతో వర్షం వస్తే కారిపోతోంది.

రాష్ట్ర ప్రభుత్వం స్పందించి శాశ్వత భవనాలు, వసతులు కల్పించకపోతే రానున్న కాలంలో ఉన్న వసతి గృహాల్లో కూడా విద్యార్థులు చేరే అవకాశం కనిపించడం లేదు. చివరకు వాటిని మూసేసే పరిస్థితులు దాపురించనున్నాయి. మౌలిక వసతులు, శాశ్వత భవనాలు, సౌకర్యాలు కల్పించి విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెచ్చులూడిపోతున్న ఎస్‌సి వసతిగృహం

బొబ్బిలి.. పొలంలో వేసిన వరికుప్పలు

అన్నదాతలో అలజడి

ప్రజాశక్తి - వీరఘట్టం

మాండూస్ తుపాను ప్రభావంతో జిల్లా అంతటా స్వల్ప వర్షం పడడంతో అన్నదాతలో అలజడి నెలకొంది. ఆరుగాలం కష్టించి సాగు చేసినప్పటికీవరి పంట చేతికందివచ్చిన తరుణంలో వాతావరణంలో ఒకసారి మార్పు రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పండిన పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు పరుగులు పెడుతున్నారు. హడావుడిగా కుప్పలు పెట్టగా, మరికొన్ని చోట్ల పొలాల్లోనే కోసి వుంచిన వరిచేలు అక్కడే ఉండిపోయాయి. శుక్రవారం రాత్రి నుంచి పడుతున్న జల్లులతో తడిచిపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మండలంలోని చలివేంద్రి, బూరుగ తదితర గ్రామాల్లో యంత్రాల ద్వారా వరి పంటను నూర్చుకుంటున్నారు. కొనుగోలు లేకపోవడంతో ఎక్కడ ధాన్యం అక్కడే కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. మరోవైపు వరికుప్పలు తడవకుండా ఉండేందుకు వాటిపై బరకాలు కూడా ఏర్పాటు చేసుకున్నారు. కల్లాల వద్ద పంటను విక్రయించేందుకు పడిగాపులు కాస్తున్నారు.

వీరఘట్టం.. ధాన్యం పాడవకుండా ఉండేందుకు కప్పిన టార్పాలిన్లు

తడిసిన వరికుప్పలు

బొబ్బిలి : అల్పపీడన ప్రభావంతో కురిసిన చిరుజల్లులతో పొలాల్లోని వరిచేలు తడిచిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా వాతావరణం చల్లగా ఉండడంతో చలి తీవ్రత పెరిగింది. చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరికుప్పలు లోపలకు వర్షపు నీరు దిగితే కంకెలు మొలకెత్తే అవకాశం అధికంగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

12న బాస్కెట్ బాల్ ఎంపికలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఈ నెల 12న తెన్నుబొడ్డవరలో అండర్-14 ,17, 19 ఎస్‌జిఎఫ్ స్కూల్ గేమ్స్ బాలురు, బాలికల బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి పొట్నూరు శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-19 పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2004 జనవరి ఒకటో తేది తరువాత జన్మించాలని చెప్పారు. స్టడీ, పదో తరగతి మార్కుల జాబితా జిరాక్సులను తీసుకురావాలని సూచించారు. వివరాలకు 7989199534ను సంప్రదించాలని కోరారు.

ఆర్‌బికె సిబ్బంది, రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నూర్ ఉల్ కమర్

ధాన్యం కొనుగోలు వేగవంతం

ప్రజాశక్తి - వీరఘట్టం

రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ నూర్ ఉల్ కమర్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని హుస్సేన్‌పురంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అనుసంధానం చేసిన మిల్లులకు తక్షణమే తరలించాలన్నారు. రైతులు సొంతగా వాహనాలు పెట్టుకుంటే రవాణా ఖర్చులు ప్రభుత్వం రైతు ఖాతాలో జమ చేస్తుందని స్పష్టం చేశారు. రైతు భరోసా కేంద్రంలో ఖాళీ గోనె సంచులను పరిశీలించారు. ఈ కేంద్రానికి 8వేల గోనెసంచులు వచ్చాయని, అందులో కొన్ని గోనె సంచులు పాడైపోయాయన్నారు. ఆర్‌బికె సిబ్బంది సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రైతు నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా పెద్ద మొత్తంలో ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. సబ్ కలెక్టర్‌తో పాటు మండల వ్యవసాయ అధికారి కె.మన్మధరావు, ఆర్ఐ జి.ప్రసాదరావు, ఆర్‌బికె సిబ్బంది, రైతులు ఉన్నారు.

గిరిజన ఉపాధ్యాయుల సమస్యలపై

12,13 తేదీల్లో చలో ఐటిడిఎ

ప్రజాశక్తి - కలెక్టరేట్

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై యుటిఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఈనెల 12,13 తేదీల్లో చలో ఐటిడిఎ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు తెలిపారు. గిరిజన విద్యారంగం ఉపాధ్యాయ సమస్యలపై అనేకమార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా పరిష్కారానికి నోచుకోలేదని, ఈ సందర్భంగా అన్ని ఐటిడిఎల్లో జీపుజాతా నిర్వహించి సమస్యలపై పోరుబాట పట్టేందుకు పాడేరులో రాష్ట్ర సదస్సు నిర్వహించామన్నారు. ఈ సదస్సులో చర్చించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అయినా సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. వీటి పరిష్కారానికి రాష్ట్రంలోని అన్ని ఐటిడిఎల వద్ద ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించిందన్నారు.

ఈ సందర్భంగా ఈనెల 12న సీతంపేట, 13న పార్వతీపురం ఐటిడిఎల వద్ద చలో ఐటిడిఎ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిఒ 3కు చట్టబద్ధత కల్పించాలని, పండిట్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, సిఆర్‌టిలను రెగ్యులరైజ్ చేయాలని, భాషా వాలంటీర్లను నియమించాలని, గిరిజన ప్రాంతంలో ఎంఇఒ డిప్యూటీ డిఇఒ పోస్టులను ట్రైబల్ వెల్ఫేర్ టీచర్ల ద్వారా భర్తీ చేయాలని, కుక్‌లను, కమాటీలను, ఎఎన్‌ఎంలను నియమించాలని, ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను సిఆర్‌టిల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

హమాలీ రేట్లు పెంచకపోతే 16 నుంచి సమ్మె : సిఐటియు

ప్రజాశక్తి - కలెక్టరేట్

పార్వతీపురం ప్రాంతంలోని రైస్‌మిల్ కళాసీలకు నూతన హమాలీ రేట్లు ఒప్పందం వెంటనే చేయాలని, లేనిచో ఈనెల16 నుంచి సమ్మె చేపట్టనున్నట్టు సిఐటియు జిల్లా అధ్యక్షులు గొర్లె వెంకటరమణ అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో పార్వతీపురం రైస్ మిల్ కళాసీ యూనియన్ నాయకులు కృష్ణ అధ్యక్షతన యూనియన్ విస్తత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకు జరుగు ఈ ఒప్పందం ఈ ఏడాది మే నాటితో ముగిసిందన్నారు. కొత్త డిమాండ్ల నోటీసు అప్పుడే ఇవ్వడం జరిగిందన్నారు. యూనియన్ యజమానులు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వద్ద ఆరుసార్లు చర్చలు జరిపిన ఇద్దరు యజమానులు మొండి వైఖరి వల్ల చర్చలు నిలిచిపోయాయన్నారు. జిల్లా అధికారులు కలుగజేసుకొని వెంటనే పరిష్కారానికి పూనుకోవాలని కోరారు. లేనిచో సమ్మె పోరాటం చేపడుతామని తెలిపారు. సిఐటియు 10వ జిల్లా మహాసభలు సందర్భంగా డిసెంబరు 13 స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి రాయగడరోడ్‌లో రైస్ మిల్లు వరకు జరిగే కార్మిక ర్యాలీలో అందరూ పాల్గొనాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ యజమానులు, లేబర్ అధికారులు నిర్లక్ష్య వైఖరితో ఆరు నెలల పాటు కాలక్షేపం చేశారని రైతులకు ధాన్యం సీజన్ ప్రారంభమైతుందున సమస్య పరిష్కారం చేయాలని పెరిగిన ధరలకు అనుగుణంగా కళాశీల కూలీరేట్లు వందశాతం పెంచాలని, రెండేళ్ల ఒప్పందం చేయాలని యజమానుల మొండి వైఖరి విడనాడాలని కోరారు. యజమానులు, అధికారులు స్పందించి డిసెంబర్ 16లోపు ఒప్పందం చేయనిచో సమ్మె చేపట్టి మిల్లు వద్ద పనులు ఆపడం జరుగుతుందని, కార్మికుల జనరల్ బాడీ సమ్మె నిర్ణయాన్ని యజమానులకు నోటీసు ద్వారా తెలియజేశామని తెలిపారు. ఈలోపు చర్చించి పరిష్కారం కానిచో పోరాటం ఉధృతం చేస్తామని యజమానులను హెచ్చరించారు. కార్యక్రమంలో 8 రైస్ మిల్లుల కళాసీలు, కమిటీ నాయకులు పి.లక్ష్మణరావు, సంగం, గోపాలం, బంటు ఆదినారాయణ, సత్యనారాయణ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.సూరిబాబు, పలువురు మేస్త్రీలు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు కళాసీల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు వెంకటరమణ

సమస్యల పరిష్కారానికే గడపగడపకు.. : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

ప్రజల సమస్యల్ని తెలుసుకుని పరిష్కరించడానికే గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టినట్లు డిప్యూటీ సిఎం రాజన్నదొర చెప్పారు. పట్టణంలోని 17వార్డు అల్లువీధి, అక్కేన వీధి, జన్ని వీధుల్లో శనివారం ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. 17వ వార్డు కౌన్సిలర్ గుల్లిపిల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యాన వార్డు నాయకులు, కార్యకర్తలు డిప్యూటీ సిఎంకు ఘనస్వాగతం పలికారు. అక్కేనవీధి రామమందిరంలో వార్డు నాయకులు, కార్యకర్తలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. ఇంకా అర్హులైన వారికి పథకాలు అందకపోతే అందజేయడానికే గడపగడపకూ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఒక్కో సచివాలయం పరిధిలో అభివృద్ధి పనుల కోసం రూ.20లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, కమిషనర్ హెచ్.శంకరరావు, హౌసింగ్ ఎఇ శ్రీనివాసరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ, ఎఎంసి డైరెక్టర్ చొక్కాపు రమణమ్మ,వార్డు నాయకులు చొక్కాపు గోపి,అక్కేన సన్యాసి రావు, మాజీ కౌన్సిలర్ యర్రా దాలినాయుడు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని ఎంఆర్ నగరంలో శనివారం గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. లబ్ధిదారులకు సంబంధించిన కరపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వంగపండు లక్ష్మి త్రినాథ నాయుడు, ఎంపిటిసి సభ్యులు బడే రామారావు, ఎంపిపి శోభారాణి, జెడ్‌పిటిసి సభ్యులు బలగ రేవతమ్మ, ఎఎంసి చైర్మన్ భాగ్యలక్ష్మి, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

వార్డు ప్రజలకు కరపత్రాలను అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రభుత్వ పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గుణానుపురంలో గడపగడపకు...

కొమరాడ : మండలంలోని గుణానుపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి గ్రామంలోని గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్నవీ, లేనివీ కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి శ్యామల, జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి, వైస్ ఎంపిపి నాగిరెడ్డి శరత్, ఎంపిడిఒ రమేష్, తహశీల్దార్ రాధాకృష్ణ, ఎఒ శంకరరావు, ఎంఇఒ నారాయణస్వామి, వైసిపి మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్ధననాయుడు, నాయకులు శెట్టి మధుసూదనరావు, సూరపు నాయుడు, మల్లి బాబు, స్థానిక నాయకులు, తదితర నాయకులు ఉన్నారు.

కష్టపడి పనిచేస్తే మంచి గుర్తింపు

ప్రజాశక్తి-బొబ్బిలి

కష్టపడి పనిచేస్తే మంచి గుర్తింపు వస్తుందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి అన్నారు. జనసేన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో కష్టపడి పని చేసిన కార్యకర్తలను మండల అధ్యక్షులుగా అధిష్టానం నియమించిందన్నారు. జనసేన బలోపేతానికి కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని కోరారు. మండల అధ్యక్షులుగా ఎన్నికైన ఎస్.గంగాధర్, రవి, సురేంద్ర, మహేష్‌ను అభినందించారు.

అన్నదాతపై అలక్ష్యం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మాటలు కోటలు దాటుతున్నా అచరణ గడప దాటడం లేదట! ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పిన మాటలకు, ఆచరణకు అచ్చంగా ఈ తెలుగు సామెత అద్ధం పడుతుంది. ధాన్యం కొనుగోలు విషయమై అధికార యంత్రాంగం చెప్పిన మాటలు ఇంపూ తెంపూ లేవు. ఈ ఏడాది ప్రతి ధాన్యపు గింజా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఇందుకోసం ఈ ఏడాది ఆర్‌బికెల అనుసంధానంగా ఏర్పాటు చేసిన క్లస్టర్ల విధానం ప్రవేశపెట్టామని దాదాపు నెలరోజులుగా సభలు, సమావేశాలు ఏర్పాటుచేసి మరీ ఊదరగొట్టారు. గోనెసంచులు కూడా అందుబాటులోకి తెస్తామని, లోండింగ్, అన్‌లోడింగ్ విషయంలో హమాలీలకు ప్రభుత్వం తరపునే ఛార్జీలు చెల్లిస్తామని, రవాణా ఛార్జీలను కూడా ప్రభుత్వమే భరిస్తుందని కూడా నొక్కి వక్కానించారు. అంతటితో ఆగలేదు. ఎప్పటి మాదిరిగా రైతులు దళారులు, మిల్లర్ల భారిన పడకుండా బిల్లులు కూడా ఆర్‌బికెల ద్వారానే తీస్తామని చెప్పారు. అంతా బాగానే ఉన్నా చెప్పిన మాటలు ఆచరణలో కనిపించడం లేదు. ఆదిలోనే హంసపాదు అన్నట్టుగా కొనుగోలులోనే జాప్యం జరుగుతుండడంతో రైతులు రోడ్లెక్కుతున్నారు. విజయనగరం జిల్లాలో 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, పార్వతీపురం మన్యం జిల్లాలో 3.30లక్షల



మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అధికార యంత్రాంగం చెబుతోంది. కానీ, ఆచరణలో అందుకు తగ్గట్టు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తుండడమే ఇందుకు తార్కాణం. వరి కోతలు, నూర్పులు ప్రారంభమై సుమారు పక్షం రోజులు దాటుతోంది. ఇప్పటికీ విజయనగరం జిల్లాలో 2,500క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. అటు పార్వతీపురం మన్యం జిల్లాలోనూ ఇదే పరిస్థితి. గొనె సంచులు ఈ రెండు జిల్లాలకు తగినన్ని రాలేదు. రూ.10 నుంచి రూ.12 విలువగల సంచులకు రూ.3.90 చెల్లిస్తామని చెప్పడంపై సర్వత్రా నిరసన వ్యక్తమౌతోంది. ఇలాన్నీ అన్ని విషయాల్లోనూ వెనుకబాటు తప్పకపోవడంతో ఈనెల 6న రైతులు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. 16న ఏకంగా ధర్నా చేపట్టేందుకు రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. విజయనగరం జిల్లాలోనూ అదే పరిస్థితి నెలకుంది. రైతులు నిరసనలకు సిద్ధమౌతున్నారు. అకాల వర్షాలు వెంటాడుతున్న నేపథ్యంలో ధాన్యం మొలకొత్తే ప్రమాదం ఉంది. ఈనేపథ్యంలో వెంటవెంటనే ధాన్యం కొనుగోలు చేసి, చెల్లింపులు కూడా 24గంటల్లోపు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఎప్పుడో కేంద్రం చెల్లించే వరకు కాకుండా రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం అన్నదాతపై అలక్ష్యం వీడీ ఆదుకునే దిశగా కదలాలని రైతులతా కోరుతున్నారు.

జాతీయ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ మహాసభను జయప్రదం చేయండి

గుమ్మలక్ష్మీపురం : ఈనెల 13,14, 15, 16 తేదీల్లో హైదరాబాద్‌లో జరగబోయే ఎస్ఎఫ్ఐ 17వ జాతీయ మహా సభను విజయవంతం చేయాలని కోరుతూ గుమ్మలక్ష్మీపురంలో శనివారం పోస్టర్లు విడుదల చేశారు. నేటి విద్యా రంగంలో మార్పులు, పరిరక్షణకు చర్యలు అన్న అంశంపై చర్చించనున్నట్టు తెలిపారు. జిల్లా నుంచి డి.పండు, కె.రాజు ప్రతినిధులుగా వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎ.గంగారావు, కె.అనిల్, నాయకులు మహేష్, సాయికుమార్, అనిల్ ఉన్నారు.

క్రీడాకారులకు టీషర్టులు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి

పార్వతీపురంటౌన్ : రాష్ట్రస్థాయి సిఎం కప్ కబడ్డీ పోటీల్లో రాణించి విజేతలుగా నిలవాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆకాంక్షించారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో పట్టణానికి చెందిన భగత్ సింగ్ కమిటీ క్లబ్ టీం సభ్యులు ఎపి రాష్ట్ర స్థాయి సిఎం కప్ కబడ్డీ పోటీలకు వెళ్తున్న సందర్భంగా శనివారం ఉదయం ఎమ్మెల్యే జోగారావును ఆయన క్యాంప్ కార్యాలయంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కబడ్డీ జట్టుకు ఏకరూప దుస్తులు అందజేసి వారిని ప్రోత్సహిస్తూ రాష్ట్రస్థాయిలో జరగబోయే పోటీల్లో విజయం సాధించి జిల్లాతో పాటు మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పలువురు ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సర్పంచ్ కుమారుడికి భూదేవి పరామర్శ

సీతంపేట : మండలంలోని ధారపాడు పంచాయతీ సర్పంచ్ జీలకర్ర సుందరమ్మ కుమారుడు రవి మేచేయి సమస్యతో శ్రీకాకుళం బగ్గు సరోజినిదేవి ఆసుపత్రిలో చేర్పించారు. సమాచారం తెలుసుకున్న తెలుగుదేశం నాయకులు పడాల భూదేవి శనివారం ఆసుపత్రిలో పరామర్శించారు. రవితో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. యూత్ లీడర్లు ఊయక భానుచందర్, ఎస్.కూర్మారావు ఉన్నారు.

గ్రామస్తులకు ఆరోగ్య విషయాలపై సూచనలు ఇస్తున్న డిఐఒ జగన్మోహనరావు

టి.సీతారాంపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్

సీతానగరం : మండలంలోని తాన్న సీతారాంపురంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని (ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్)ను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు పర్యవేక్షణలో జరిగింది. సీతానగరం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శిరీష రోగులకు చేపట్టిన ఆరోగ్య తనిఖీలు చేశారు. అలాగే రోగులకు చేసిన రక్త పరీక్షలను పరిశీలించారు. స్థానికులకు ఈ కుటుంబ డాక్టర్ విధానంపై అవగాహన కల్పించి, ఆవశ్యకతను వివరించారు. అలాగే పలు అనారోగ్య లక్షణాలు, కాలాను గుణంగా వచ్చే వ్యాధులపై డిఐఒ స్థానికులకు వివరించి వారికి గల సందేహాలను నివృత్తి చేశారు. తదుపరి గ్రామంలో క్షేత్ర స్థాయి సందర్శనలను పర్యవేక్షించారు. కదల్లేని స్థితిలో ఉన్న వృద్ధుల గృహ సందర్శనలో వారి ఆరోగ్య స్థితిని పరిశీలించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని వైద్య సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మర్రాపు శ్రీదేవి, సూపర్‌వైజర్ భవాని, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్ పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ పరిసరాలను ఏశుభ్రం చేస్తున్న సిబ్బంది

పోలీస్ స్టేషన్ ఆవరణలో పారిశుధ్య పనులు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్ ఆవరణంలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను, చెత్త చెదారాన్ని స్థానిక పోలీసు సిబ్బంది శ్రమదానం చేసి పరిశుభ్ర పర్చారు. సిఐ సత్యనారాయణ, ఎస్ఐ షణ్ముఖరావు ఆధ్వర్యాన నిర్వహించిన. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

వీరఘట్టం : ఎయిడ్స్ నియంత్రణపై శనివారం మండల కేంద్రంలోని కూరాకుల వీధిలో బుర్రకథ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు రాజేశ్వరి, జానకి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేటలో మానవ హక్కుల దినోత్సవం

సీతంపేట: జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్, మండల అధ్యక్షులు బిడ్డిక సుబ్బారావు శనివారం స్థానిక బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయ సాధనకు యువత ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజల హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. ప్రజలకు అండగా మానవ హక్కుల కమిషన్ ఉందన్నారు. అధ్యక్షులు బిడ్డిక సోమినాయుడు, మండల సెక్రెటరీ మండంగి మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మానవహక్కుల సంఘం నాయకులు

13, 14 తేదీల్లో సిఐటియు జిల్లా మహాసభ

ప్రజాశక్తి - బలిజిపేట

ఈనెల 13, 14 తేదీల్లో జరగబోయే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల నాయకులు దాలమ్మ తెలిపారు. శనివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మహాసభల పోస్టరును సిఐటియు మండల నాయకులతో కలిసి ఆమె విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాస్థాయిలో జరుగుతున్న ఈ సమావేశాలకు మండల కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ మహాసభకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నరసింహారావు, కార్యదర్శి సుబ్బారావు పాల్గొంటారని, కావున ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

పాలకొండ రూరల్: ఈనెల 13,14 తేదీల్లో పార్వతీపురంలో జరుగు సిఐటియు పదో మహాసభల్లో అంగన్వాడీ, ఆశా, మిడ్ డే మీల్స్, భవన నిర్మాణ, ఆటో కార్మికులు, విఆర్ఎలు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ,మున్సిపల్, రైస్ మిల్ కార్మికులు అందరు సకాలంలో హాజరు రావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి దావాల రమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం రైస్ మిల్ కార్మికుల సమావేశం సందర్భంగా మహాసభలను జయప్రదం చేయాలని ర్యాలీ నిర్వహించారు. అనంతరం దావాల రమణారావు, మండల కార్యదర్శి కాదా రాము, రైస్ మిల్ అధ్యక్ష కార్యదర్శి జి.సత్యం, వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని వర్గాల వారిని, అన్ని విధాలా ప్రతిరోజూ నష్టం జరిగే పరిస్థితి ఉందన్నారు. అన్ని వర్గాల కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, రాజకీయ వేధింపులు పెరిగాయని, ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాల్లేవని, అలాగే కరోనా వైరస్ వ్యాప్తి చెందే సందర్భంలో మరణించిన కార్మికులకు నేటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి భరోసా లేదన్నారు. ఇలాంటి సమయంలో జరుగు సిఐటియు మహాసభల్లో కార్మికులంతా పాల్గొని భవిష్యత్ కార్తవ్యాలు, పోరాటాలను చర్చించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎర్నేన సింహాలు, చల్లా స్వామి నాయుడు, కే .సూరయ్య మున్సిపల్ వర్కర్స్ నాయకులు సిహెచ్ సంజీవి తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేటలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

పాలకొండలో ప్రచార ర్యాలీ చేస్తున్న సిఐటియు నాయకులు

కొమరాడ : ఈనెల 13, 14 తేదీల్లో పార్వతీపురంలో జరిగే సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. గురువారం కూనేరు సంతలో మహాసభల గోడపత్రికలు విడుదల చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ మహాసభల సందర్భంగా తొలిరోజు పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. కావున కార్మికులంతా మహాసభలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాము, సుబ్బారావు, వెంకటరావు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కార్మికుల హక్కులు, చట్టాలు పరిరక్షణకై ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన అవసరం ఉందని శ్రామిక సంఘం జిల్లా నాయకులు వి.ఇందిర పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానికగిరిజన సంఘం కార్యాలయంలో సిఐటియు మండల మహాసభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇందిర మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో కార్మికులు, కర్షకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టే పనిలో మోడీ సర్కార్ ఉందన్నారు. ఇదే జరిగితే ఉద్యోగ భద్రత పూర్తిగా కరువుతుందన్నారు. బిజెపి తీసుకొస్తున్న నూతన విధానాలు కార్మికులకు, కష్టజీవులకు నష్టదాయకంగా ఉన్నాయని తెలిపారు. కార్మికుల హక్కులు, చట్టాలను నిర్వీర్యం చేసే పరిస్థితి ఉందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తామని ప్రకటన చేసిన ప్రభుత్వాలు ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టే పనిలో ఉన్నాయని మండిపడ్డారు. ఉపాధి కల్పన లేకపోయినా ధరలు పెరుగుదల మాత్రం విపరీతంగా ఉందన్నారు. నిత్యాసర సరుకులు, పెట్రోలు, డీజిల్ గ్యాస్ ధరలు పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే ఉద్యమ కార్యాచరణకై ఈనెల 13, 14వ తేదీల్లో జరగనున్న సిఐటియు జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో చెముడుగూడ ఎంపిటిసి మండంగి రమణ, ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోలక అవినాష్, మండల కార్యదర్శి పువ్వల తిరుపతిరావు, తదితరులు ఉన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు ఇందిర

గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పల్లవీరాజు

పాఠశాలను తరలిస్తే ఊరుకోం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని ఉదయపురం ప్రభుత్వ పాఠశాలను వేరే గ్రామానికి తరలిస్తే చూస్తూ ఊరుకోమని టిడిపి నాయకులు శత్రుచర్ల పల్లవీరాజు హెచ్చరించారు. శనివారం ఆమె ఉదయపురం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల ఆమెతో మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పాతదని, ఇక్కడ ఉండేదని ఆ భవనం పాడవ్వడంతో ప్రస్తుతం ఆ విద్యార్థులకు వంట గదిలో పాఠాలు చెబుతున్నారని కొత్తగా కూడా ఇక్కడే నూతన భవనం మంజూరైందన్నారు. అయితే కొందరు రాజకీయ నాయకుల అండదండలతో ఆ పాఠశాలను వేరే గ్రామానికి తరలించడానికి చూస్తున్నారని గ్రామస్తులు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ కేంద్రమైన ఉదయపురంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల ఉందని దీంతో పాటు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అక్కడే ఉందని దీన్ని వేరే గ్రామానికి తరలించాలనుకోవడం సమంజసం కాదని అన్నారు. పంచాయతీ కేంద్రం ఎక్కడ ఉందో అక్కడే ఈ పాఠశాల ఉండాలని అన్నారు. అంతగా ఆ గ్రామానికి పాఠశాల కావాలంటే కొత్తగా మంజూరు చేయించుకోవాలి తప్ప ఉన్న పాఠశాలను తరలిస్తే ఊరుకునేది లేదని గ్రామస్తులు తరపున పోరాడుతామని హెచ్చరించారు. ఆమె వెంట టిడిపి నాయకులు బోటు గౌరీ, అజిత్ కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యం : డిప్యూటీ స్పీకర్

విజయనగరం టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న ప్రజా రంజక పాలన, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శనివారం నగరంలోని నాగవంశపు వీధి జంక్షన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని అన్నారు. టిడిపి చేపట్టిన బాదుడే బాదుడు కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కానరాలేదని అన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన దగ్గర నుంచి , ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కృషి చేస్తున్నారని అన్నారు.

రామశేషు హంతకులను శిక్షించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మం వైసిపి నాయకులు, వైస్ ఎంపిపి బరాటం రామశేషును హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని పార్వతీపురం మన్యం జిల్లా కళింగవైశ్య సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. రామశేషు దారుణ హత్యకు నిరసనగా హత్య చేసిన హంతుకుల్ని ఎంతటివారైనా పట్టుకొని కఠినంగా శిక్షించాలని, వారి కుటుంబానికి ఇకపై ఎలాంటి హాని కలగకుండా భరోసా ఇవ్వాలని, శాంతి భద్రతలు పర్యవేక్షించి కాపాడాలని శనివారం పార్వతీపురంలో ర్యాలీ చేసి అనంతరం ఎఎస్‌పి దిలీప్‌కిరణ్‌కు వినతిపత్రం అందించారు. దీనికి ఎఎస్‌పి సానుకూలంగా స్పందించి ఇలాంటి సంఘటనలు ఈ ప్రాంతంలో జరగకుండా పర్యవేక్షిస్తామని, ఆ జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో ఈ విషయంపై మాట్లాడతానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ వైశ్య ప్రముఖులు అందరూ పాల్గొన్నారు.

కురుపాం : శ్రీకాకుళం జిల్లా గార మండలం శ్రీకూర్మం గ్రామానికి చెందిన కళింగ వైశ్య ప్రముఖుడు బరాటం రామ శేషును దారుణంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ కురుపాం కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా కళింగ వైశ్య సంఘం అధ్యక్షులు అందవరపు కోటేశ్వరరావు, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కెవి సురేష్ కుమార్, కళింగ వైశ్య సంఘం కురుపాం అధ్యక్షులు కె.రవీంద్రకుమార్, కళింగ వైశ్య సంఘ పెద్దలు, కలింగ వైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కురుపాంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న కళింగ వైశ్యులు

గర్భిణులకు తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు వైద్యాధికారి కె.శిరీష ఆరోగ్య తనిఖీలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. రక్తహీనత ఉన్న వారిని ముందుగా గుర్తించి వారికి ప్రత్యేకమైన తనిఖీలు నిర్వహించి రక్తహీనత లాభాన్ని అధిగమించే చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వాసుపత్రిలో ప్రసమయ్యేలా అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గర్భిణీలు పాల్గొన్నారు.

నిందితులకు జైలు శిక్ష

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం పోలీసుస్టేషన్ పరిధిలో 2019లో నమోదైన సెల్ ఫోన్ దొంగతనం కేసులో ముద్దాయిలైన సిద్ధంగూడ గ్రామానికి చెందిన పత్తిక బిసంబర్, నిగరానికి చెందిన బిడ్డిక బిసో, పెదగూడకు చెందిన బిడ్డిక సుధీర్‌పై నేరం రుజువైనందున శుక్రవారం స్థానిక జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఇ.ఆంజనేయులు ముద్దాయిలు ముగ్గురికి నెల రోజులు జైలు శిక్ష, రూ. 3వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించనిచో మరో వారం రోజులు జైలు శిక్ష విధించారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిమిడి చంద్రకుమార్ వాదించారు.

11న జిల్లా స్థాయి చెకుముకి పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతీ సంవత్సరం జన విజ్ఞాన వేదిక విద్యార్థులలో శాస్త్రీయ అవగాహన పెంచే విధంగా చెకుముకి సంబరాలు నిర్వహిస్తోంది. ఈ సారి కూడా రాష్ట్ర వ్యాప్తంగా చెకుముకి సంబరాలు జరుగుతూ ఉన్నాయి. వీటిలో భాగంగా గత రెండు నెలల్లో స్కూల్, మండల స్థాయి పరీక్షలు నిర్వహించారు. సైన్స్ టీచర్లకు, ఉచిత సైన్స్ కిట్లు పంపిణీ లాంటి కార్యక్రమాలు జరిగాయి. ఈనెల 11న ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి పరీక్ష నిర్వహణ స్థానిక సత్య డిగ్రీ కళాశాలలో జరుగుతుందని జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవిఎన్ వెంకటరావు, రమణ ప్రభాత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష లో మండల, పట్టణ స్థాయిలో ప్రథమ స్థానం వచ్చిన ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కావాలని కోరారు. విద్యార్థులకు ధ్రువ పత్రాలతో పాటు విశ్వ విజ్ఞానానికి సంబధించిన పుస్తకాలు బహుమతులుగా ఇస్తామని తెలిపారు.

పెదఖర్గలో 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని పెద్దఖర్గలో ఇదేం కర్మ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మూడేళ్ల పాలనలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి, మండల కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు ఎ.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని పెద్దిదిమిలిలో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అధికార వైసిపి ప్రభుత్వం ఆగాడాలు, భవిష్యత్తు ఎపికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని, రాష్ట్రంలో జీతాలు సకాలంలో చెల్లించలేని పరిస్థితి, సామాన్యుడు కనీస అవసరాల వస్తువులపై భారీ రేట్లు, అడ్డుగోలు అక్రమాలు, ప్రాంతీయ పేరుతో విభేదాలు, రాష్ట్ర భవిష్యత్తు కోరుకునే ప్రజలు వాస్తవాలు గ్రహించాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు బోగాపురపు రవి నాయుడు, టిడిపి జిల్లా కార్యదర్శి మేడిబోయిన జగదీశ్వరరావు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, అంపిలి కేశవ, సాకేటి రామారావు, దశాల నాయుడు, గవర ధర్మారావు, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదఖర్గలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

శిథిలం... భయం... భయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లోవముఠా ప్రాంతమైన దేరువాడ జిసిసి డిపో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. గోడలు పూర్తిగా బీటలు వారడంతో ప్రస్తుతం కూలేలా ఉంది. వర్షం పడిందంటే చాలు గదుల్లోకి నీరు చేరి నిత్యావసర సరుకులు పూర్తిగా తడిసిపోతున్నాయి. దశాబ్దాలు నాటి భవనాన్ని బాగు చేయడమా తొలగించడమా, దీని స్థానంలో కొత్తది నిర్మించడం చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యను జిసిసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా గతంలో భవనం మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు.

శిథిలావస్థలో ఉన్న దేరువాడ జిసిసి డిపో భవనం

సొంతింటి కల్పనే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బొబ్బిలి

అర్హత గల పేదలందరికీ సొంతింటి నిర్మాణ కల్పనే ప్రభుత్వ లక్ష్యమనిస్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో బాడంగి మండలం పెద్దపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో ఇల్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, బాడంగి జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, తహశీల్దార్ బాలమురళీకృష్ణ, వైసిపి నాయకులు ఆవు సత్యనారాయణ ఉన్నారు.

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No.10/2022 in O.S.No. 22/2016

Between:
నులకల రమేష్ ....పిటిషనర్/డిక్రిహోల్డర్
And:
1. తోట సామన్న (Died)
2. తిరుమరెడ్డి మంగ
3. తోట పార్వతి
4. తిరుమరెడ్డి ధర్మారావు
5. తిరుమరెడ్డి ప్రసాద్
6. తిరుమరెడ్డి రమణమ్మ
7. తిరుమరెడ్డి కుమార్ ...రెస్పాండెంట్స్/జడ్జిమెంటు డెటార్స్

ఇందు మూలంగా తెలియజేయునదేమునగా పై DHr పై నెంబరు అమలును పై JDrs పై, పైనెంబరు దావా డిక్రీ బాకీ వసూలు నిమిత్తం ఆర్డర్ 21, రూలు 22 of C.P.C ప్రకారం అమలు పిటిషన్ దాఖలు చేసినందున యిందు విషయమై మీకు ఆక్షేపణ యున్న యెడల **తే 28-12-2022దీన ఉదయం గం॥ 10-30 ని॥**లకు మీరు స్వయంగా గాని, మీ న్యాయవాది ద్వారాగాని పై కోర్టులో హాజరు అయి మీ వాదన శ్రీ కోర్టులో దాఖలు చేసికొనవలసింది. లేనియెడల **తే 28-12-2022 దీన** శ్రీ కోర్టువారు పై విషయం మీకు పరోక్షమున పై నెంబరు పిటిషన్ తీర్మానం చేయుదురు అని యిందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

బొత్స శ్రీనివాసరావు
న్యాయవాది, R/o గుమడాం,
సాలూరు మున్సిపాలిటీ,
పార్వతీపురం మన్యం జిల్లా,
సెల్ : 9494325772
పిటిషనర్/డిక్రిహోల్డర్ తరుపు నాయవాది

సీతంలో 'ఉపాధి నైపుణ్యం'పై సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఉపాధి నైపుణ్యంపై అవగాహనా సదస్సు నిర్వహించారు.కార్యక్రమంలో టిసిఎస్ డెలివరీ మేనేజర్, డేటా ఎనలిస్టు శేఖర్ విద్యార్థుల ఉపాధి నైపుణ్యంపై అవగాహన కల్పించేరు. ఇంజినీరింగ్ విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే కమ్యూనికేషన్‌పై పట్టు సాధించాలని, సాఫ్ట్ వేర్‌కు సంబంధించిన ప్రోగ్రామింగ్ మెలుకువలు నేర్చుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధి సాధించేందుకు కావాల్సిన మెలకువలన్నీ నేర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డివి రామ్మూర్తి, హెచ్ఒడిలు , ట్రెనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ బికె రావు అవినాష్ పాల్గొన్నారు.